18న సివిల్స్ విజేత నరేంద్రకు సత్కారం

చిట్టపులి నరేంద్ర పడాల్

ప్రజాశక్తి- హుకుంపేట: సివిల్స్‌లో ఆలిండియా 545 ర్యాంకు సాధించి విజేతగా నిలిచిన అండిభ గ్రామానికి చెందిన చిట్టపులి నరేంద్ర పడాల్‌కు ఈనెల 18న శనివారం ఉదయం 11గంటలకు అదే గ్రామంలో పౌరసన్మానం చేయనున్నట్లు వైస్ ఎంపిప సూడిపల్లి కొండల రావు, అండిభ సర్పంచ్ తామర్ల సత్య నారాయణ తెలిపారు. అండిభ గ్రామానికి చెందిన ప్రిన్సిపాల్ చిట్టపులి దాల్ పడాల్ కుమారుడు నరేంద్ర ఉత్తమ ర్యాంకుతో సత్తాచాటి ఐఎఎస్‌కు ఎంపికైన గిరిజనానికి గర్వకారణమని, ఆయనను ఆదర్శంగా తీసుకుని మరింత మంది రాణించాలన్నారు. కార్యక్రమానికి గిరిజన ప్రజా ప్రతినిధులు, పెద్దలు, ఉద్యోగులు, మహిళలు, గిరిజన యువత, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సాదాసీదాగా మండల సమావేశం

ఎన్నికల కోడ్ నేపథ్యంలో చర్చలు, తీర్మానాలు లేకుండానే ముగింపు

మండల సభలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎటువంటి చర్చలు, తీర్మానాలు, ప్రతిపాదనలు, ఆమోదాలు, ప్రసంగాలు లేకుండానే స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. గురువారం ఎంపిపి శెట్టి నీలవేణి అధ్యక్షతన జరిగిన 11వ మండల సభలో జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, పోలింగ్ ముగిసినప్పటికీ, ఫలితాలు వెలువడేవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటున్న నేపథ్యంలో ఎటువంటి తీర్మానాలు, ప్రతిపాదనలకు అస్కారం లేదన్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో సమస్యలపై చర్చ జరగకున్నా, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ఫలితాల వెలువడిన తర్వాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరోమారు సమావేశమై అధికారులు, నేతలంతా సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలను శాంతియుతంగా,పకడ్బందీగా నిర్వహణకు శ్రమించిన అధికార యంత్రాంగానికి మండల ప్రజా ప్రతినిధుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపిడిఒ నగేష్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు

అపరిశుభ్రతకు నెలవుగా ఆసుపత్రి

- దుర్వాసనతో రోగుల ఇబ్బందులు
- అందని వైద్యసేవలతో అవస్థలు

పిహెచ్‌సిలో రోగుల దుస్థితిని పరిశీలిస్తున్న సిపిఎం నేత సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు : పెదబయలులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అపరిశుభ్రత, అసౌకర్యాలకు నెలవుగా ఉందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బోండా సన్నిబాబు విమర్శించారు. ఆసుపత్రికి అనారోగ్యంతో వస్తే, ఉన్న జబ్బు నయం కావడం మాట అటుంచితే, కొత్త రోగాలు వచ్చే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అస్వస్థతకు గురైన తన బిడ్డను వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకెళ్లిన సన్నిబాబు, అక్కడ నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోపలికి అడుగు పెట్టగానే ముక్కు పుటాలను అదరగొట్టే దుర్గంధం ఉందని, గురువారం ఆసుపత్రిని కనీసం శుభ్రపరిచే పరిస్థితులు లేకపోవడం దారుణమన్నారు.

స్థానిక వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్ల ఆసుపత్రి మొత్తం అపరిశుభ్రత, దుర్వాసనతో నిండి రోగులందరూ నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.వార్డులో ఇన్‌పేషెంట్లుగా చేరాలనుకుంటే మరుగుదొడ్ల నుంచి వస్తున్న కంపుతో ఉండలేని స్థితి ఉందన్నారు.

24 గంటలూ రోగులకు అందుబాటులో వైద్యసేవలు అందించాల్సిన స్థానిక పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులు సమయపాలన పాటించడం లేదని తెలిసిందన్నారు. సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోగా, మందులుకూడా అందుబాటులో లేవని, దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు నామమాత్రపు వైద్యసేవలు అందే పరిస్థితి లేదన్నారు. మారుమూల గ్రామాలన ఉంచి ఎంతో ఆశగా వైద్యసేవలకు వచ్చిన గిరిజన రోగులకు నిరాశే తప్ప, ఇక్కడ కనీసస్థాయి వైద్యం కూడా అందడం లేదన్నారు.దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని, ఆసుపత్రిలో పరిశుభ్రత, వైద్యసేవలు మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని సన్నిబాబు డిమాండ్ చేశారు.

మూగజీవాలకు వ్యాక్సినేషన్

పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ గణేశ్వరరావు, సిబ్బంది

ప్రజాశక్తి -అనంతగిరి : వేసవి.తొలకరి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా వ్యాధి నిరోధిక టీకాలు వేస్తున్నట్లు కాశీపట్నం పశు వైద్యాధికారి డాక్టర్ సాగరి గణేశ్వరరావు తెలిపారు. గురువారం కాశీపట్నం పంచాయతీ శార్వాణిపాలెం, కాటూరు, పలంవస, చుట్టుప్రక్కల గ్రామాలలో సందర్శించి పశువులు, మేకలకు వైద్యసేవలు అందించామన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78 పశువులకు జబ్బవాపు వ్యాధికి, 184 మేకలకు చిటుకు వ్యాధి నిరోదిక టీకాలు వేశామన్నారు. పసర గడ్డి తినడం వల్ల పశువులకు వ్యాపించే వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని పాడిరైతులు, జీవాల పెంపకందారులకు అవగాహన కల్పించారు. పశువులకు వ్యాధులు సోకిన వెంటనే సంబంధిత సచివాలయంలోని వెటర్నరీ అసిస్టెంట్, పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, వారి సూచనల మేరకు మూగజీవాలకు వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు

ఘాట్‌రోడ్డులో ప్రమాదం : వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు ఘాట్ రోడ్డులోని గరికబంద సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బుచ్చియ్యపేటకు చెందిన వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి. బుచ్చయ్యపేటకు చెందిన గాడి పరసయ్య తన భార్య రమణమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై పాడేరు మోదమాంబ దర్శనానికి వెళుతుండగా, గరికబంధ సమీపంలో వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పరసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అతని భార్య రమణమ్మను స్థానికులు అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాజ్‌వే లేక కష్టాలు!

- అంజోడ గెడ్డపై రాకపోకలకు ఇక్కట్లు
- తారురోడ్డు నిర్మించి వదిలేసిన అధికారులు
- అప్రోచ్ రోడ్డు ఏర్పాటులోనూ నిర్లక్ష్యం
- వర్షాల సీజన్‌లో నిలిచిపోతున్న రవాణా
- అవస్థలు పడుతున్న మన్యవాసులు

అంజోడ గెడ్డపై పూర్తిగా శిథిలమైన కాజ్‌వే

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయితీ పెద అంజోడ గ్రామానికి సమీపంలో గెడ్డపై కాజ్‌వే నిర్మాణంలో నిర్లక్ష్యంతో గిరిజనులు రాకపోకలకు తీవ్ర కష్టాలు పడుతున్నారు. కొర్రాయి రోడ్డు జంక్షన్ నుంచి జాంగూడ మీదుగా పెద్ద అంజోడ వరకూ తారురోడ్డు నిర్మించారు, కానీ అంజోడకు సమీపంలో ఉన్న గెడ్డపై కాజ్‌వేగానీ, వంతెన గానీ నిర్మించలేదు. దీంతో వర్షాలు కురిసినప్పుడు ఉధృతంగా ప్రవహించే గెడ్డనీరు రోడ్డుపైకి చేరడంతో వాహనాలు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతూ దాదాపు స్తంభించిపోయే పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

అంజోడ, పరిసర గ్రామాల గిరిజనులు తాము పండించిన కూరగాయలు కానీ, ఇతర అటవీ ఉత్పత్తులు, వస్తువులను వారపుసంతలకు తరలించి విక్రయించాలంటే వీలులేకుండా పోతోందని మన్యవాసులు ఆవేదన చెందతున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండటంతో, కాజ్‌వే వద్ద గెడ్డను దాటడం ప్రాణసాహసమేనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక అత్యవసర వైద్యం కోసం రోగులను ఆసుపత్రికి తరలించలేకపోతున్నామని గ్రామస్తులు అంటున్నారు. రోడ్డు నిర్మించేటప్పుడే అంజోడ గెడ్డపై ఉన్న కాజ్‌వేను పునర్నిర్మించి పటిష్టం చేయడమో, లేకుంటే అదే స్థానంలో చిన్న కల్వర్టునైనా నిర్మించాలని సంబంధిత అధికారులకు స్థానిక గిరిజనులు పలుమార్లు విన్నవించుకున్నా స్పందన లేదని వాపోతున్నారు. అంజోడ గెడ్డ వరకు. తారురోడ్డు నిర్మించి దాదాపు నాలుగేళ్లు కావస్తున్నా, కాజ్‌వే, దానికి ఆనుకుని అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం వర్షాల సీజన్‌లో తమ ప్రాణాల మీదకు తేవడంతోపాటు నానా ఇక్కట్లు పాల్జేస్తోందని అంటున్నారు. పూర్తిగా శిథిలమైన కాజ్‌వే పైనుంచి అత్యవసర పరిస్థితుల్లో దాటేందుకు ప్రయత్నించి, ప్రమాదాలకు గురైన ఘటనలూ పలు చోటుచేసుకున్నాయని స్థానికులు అంటున్నారు. మూడు,నాలుగేళ్లు గడుస్తున్న ఇప్పటికీ కాజ్వే నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రవాణా సౌకర్యానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తున్న సమయంలో ద్విచక్రనాలతో బైక్‌లను కాజ్‌వేను దాటి వెళ్లే ప్రయత్నం చేసి కొట్టుకుపోయిన సందర్భాలను స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, అంజోడ వద్ద గెడ్డపై కాజ్‌వేగానీ, కల్వర్టును గానీ నిర్మాణానికి చర్యలు చేపట్టి, వచ్చే వర్షాల సీజన్‌లోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు. ప్రాణ ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

స్ట్రాంగ్‌రూంలో జిల్లా కలెక్టర్ తనిఖీలు

స్ట్రాంగ్‌రూం పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి -పాడేరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, ఎం విజయసునీత గురువారం తనిఖీ చేసారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గం, పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం ఇవిఎంలను భద్రపరిచిన గదులను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమరాలు సక్రమంగా నిరంతరం పనిచేసేలా చూడాలని ఆదేశించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇతరులు డిగ్రీ కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించకుండా తగిన విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పాడేరు అరకువ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ పాల్గొన్నారు..

విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం లేకుండా చర్యలు

- ఏపీ జెన్కో జల విద్యుత్ కేంద్రాల హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ ఆదేశం
- సీలేరు కాంప్లెక్స్ పరిధిలో సుడిగాలి పర్యటన

పోల్లూరు జల విద్యుత్ కేంద్రంలో రెండో దశ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి -సీలేరు

జలవిద్యుత్ కేంద్రాల్లోని యూనిట్లలో సాంకేతిక లోపాలు తలెత్తకుండా, విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించాలని సంబంధిత అధికారులను ఏపీ జెన్కో జల విద్యుత్ కేంద్రాల హైడల్ డైరెక్టర్ ఎంవివి సత్యనారాయణ ఆదేశించారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో గురువారం హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ సుడిగాలి పర్యటన చేశారు. కాంప్లెక్స్ పరిధిలో రూ.530 కోట్లు వ్యయంతో జరుగుతున్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోని రెండవ దశ నిర్మాణ పనులను స్థానిక జెన్కో అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఐదు, ఆరు యూనిట్లుకు నీటి సరఫరా చేసే మెగాస్టార్ పైప్‌లైన్ ఎరక్షన్ పనులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం జల విద్యుత్ కేంద్రంలోని నూతనంగా అమర్చేందుకు ఐదు, ఆరు యూనిట్లు డిజైన్ చేసిన సివిల్ పనులు పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రంలో ఉన్న నాలుగు యూనిట్లులో జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి, వాటి పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా వెంటనే యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసేలా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సీలేరు కాంప్లెక్స్‌లో అన్ని జలవిద్యుత్ కేంద్రాల్లో జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి గురించి మోతుగూడెం చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్‌ని అడిగి తెలుసుకున్నారు. జలవిద్యుత్ కేంద్రాలకు నీటి సరఫరా చేసే బలిమెల జలాశయంలో ఆంధ్రా వాటా నీటి నిల్వలు ఎంత ఉన్నాయని ఆరా తీశారు. సీలేరు, డొంకాయి జలాశయాల్లో నీటి నిల్వలు ఏ మేరకు ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్, ఎస్ఈ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్, పంపు స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్చార్జి ఓ అండ్ డ్యామ్ ఎస్ఈ బాలకృష్ణ, డిఈ టి.వరప్రసాద్, అసిస్టెంట్ సెక్యూరిటీ అధికారి సూర్య మోహన్ రావు, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో సమస్యలను పరిష్కరించాలి

మండల పరిషత్తు సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి -రాజవొమ్మంగి

మండలంలోని రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు ప్రజాప్రతినిధులు గురువారం డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో లబ్బర్తి, దూసరపాము ఎంపీటీసీలు గొల్లపూడి పెద్దిరాజు, నల్లా సత్యనారాయణ మాట్లాడుతూ రాజవొమ్మంగి పిహెచ్సిలో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వైద్యులు అందుబాటులో లేకుండా ఫోన్ ద్వారా వైద్యం చేయిస్తున్నారని ఆరోపించారు. ఆ పిహెచ్సిలో ప్రతిరోజు ఓపి 150పైగా నమోదుకాగా, ముగ్గురు వైద్యులు, నలుగురు స్టాఫ్ నర్సులు అవసరం ఉందని, ఇక్కడ పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల ఇబ్బందుల నేపథ్యంలో రాజవొమ్మంగిలో బస్ షెల్టర్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. 516ఈ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా రహదారికి ఇరువైపులా ఉన్న అనేక మహా వృక్షాలను తొలగించారని, ఈ నేపథ్యంలో వేసవి కాలం కావడంతో రహదారి వెంబడి వాహనదారులకు, పాదచారులకు నీడలేక ఇబ్బందులు పడుతున్నారని, చెరుకుంపాలెం నుండి శరభవరం వరకు రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటాలని ఎంపీటీసీలు పెద్దిరాజు, సత్తిబాబు, కొండపల్లి, చికిలింత సర్పంచ్లు జగన్నాథం, కొండ్ల సూరిబాబు డిమాండ్ చేశారు. మండలంలో ఓట్టిగెడ్డ, మడేరు రిజర్వాయర్ల ప్రధాన కాలువ పూడికతీత పనులు ఈ వేసవిలో పూర్తి చేసినట్లయితే పంటలకు నీటి ఎద్దడి లేకుండా ఉంటుందని ఎంపీటీసీలు మీనవల్లి సుబ్బారావు, సత్తిబాబు, పెద్దిరాజులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదిగిరేశ్వరావు, వైస్ ఎంపీపీలు సత్య చంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, ఎంపీటీసీలు కనిగిరి గంగా దుర్గ, కానెం అచ్చయ్యమ్మ, చంద్రు లోవలక్ష్మి, ఆవుగడ్డ నిర్మలాదేవి, కో ఆప్షన్ సభ్యులు అడపా కామేష్, సర్పంచులు కొంగర మురళీకృష్ణ, బూసరి సత్తిబాబు, ఎం సత్యవతి, గణలక్ష్మి, ఎ.సుబ్బలక్ష్మి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి గోము వెంకటలక్ష్మి

అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న తాబేళ్ళు

ఉల్లిపాయలు మాటున తాబేళ్ల అక్రమ రవాణా

- 1589 తాబేళ్లు స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -రంపచోడవరం

మాట్లాడుతున్న డిఎఫ్ఒ నరేంద్రన్

ఉల్లిపాయలు రవాణా మాటున అక్రమంగా రవాణా చేస్తున్న 1589 తాబేళ్లను అటవీశాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తాబేళ్లను తరలిస్తున్న వ్యాన్‌ను రంపచోడవరం మండలం ఫోక్స్‌పేట ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రంపచోడవరం ఫారెస్ట్ డిఎఫ్ఒ నరేంద్రన్ తెలిపారు. ఫోక్స్‌పేట ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డిఎఫ్ఓ నరేంద్రన్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. డిఎఫ్ఒ కథనం ప్రకారం... తాబేళ్ల అక్రమ రవాణా జరుగుతుందని అందిన ముందస్తు సమాచారం మేరకు ఫోక్స్‌పేటలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద అటవీశాఖ అధికారులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో గోకవరం వైపు నుండి వస్తున్న అశోక్ లేలాండ్ దోస్త్ వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో పై భాగంలో ఉల్లిపాయలు ఉండగా, కింది భాగంలో సుమారు 20 సంచులలో తాబేళ్లను వేసి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకొని తాబేళ్ల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కోనసీమ జిల్లా రామచంద్రపురం నుండి ఒడిశా రాష్ట్రానికి ఈ తాబేళ్లను తరలిస్తున్నట్లు పట్టుబడిన నిందితులు తెలిపారు. వారి వద్ద నుండి 20 గోను సంచులలో సుమారు 1589 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 163 చనిపోగా, మిగిలిన 1426 బతికే ఉన్నాయి. ఈ తాబేళ్లను అటవీ ప్రాంతంలోని నీటి సౌకర్యం గల ప్రాంతాలలో సురక్షితంగా వదిలిపెడతామని డిఎఫ్ఒ నరేంద్రన్ తెలిపారు. ఈ అక్రమ రవాణా వెనుక ఎవరు ఉన్నా వారిని పట్టుకుని శిక్షిస్తామని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కరుణాకర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లకు సిపిఎం అభ్యర్థి లోతా ధన్యవాదాలు

- మద్దతుగా నిలిచిన వారికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి -రాజవొమ్మంగి

ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లకు సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు గురువారం ప్రకటనలో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక మద్దతుతో పోటీ చేసిన తనను గెలిపించాలని సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానూలు, ఆదివాసీ జెఏసీ నాయకులు, మేధావులు, మహిళలు, పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, వామపక్షాల పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులు పడుతూ, ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ సీపీఎం జెండా మోస్తూ సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని అహర్నిశలు కష్టపడి పని చేశారని, వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -మారేడుమిల్లి

వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో మారేడుమిల్లి శాఖ గ్రంథాలయంలో ఈ నెల 15 నుండి జూన్ 7వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరాల్లో విద్యార్థులకు కథలు, ఆటలు, చిత్రలేఖనం వంటి సృజనాత్మక కార్యక్రమాలను నేర్పించడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు ఆసక్తిగల తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించి ఈ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నేడు మూడు మండలాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- రంపచోడవరం, మారేడుమిల్లి

మారేడుమిల్లి 33కెవి ఫీడర్ పరిధిలో చెట్లు కొమ్మలు తొలగింపు (ట్రీ కటింగ్) కారణంగా శుక్రవారం రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి మండలాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ ఎండి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం మండలంలోని రంప నుండి మద్దివీడు వరకు, బోర్నగూడెం నుండి దేవిపట్నం, దేవిపట్నం మండలంలోని గెద్దాడ నుండి ఆకూరు వరకు, మారేడుమిల్లి మండలం పరిసర గ్రామాలకు శుక్రవారం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దీనికి ఆయా గ్రామాల పరిధిలో విద్యుత్ వినియోగదారులు సహకరంచాలని కోరారు.

ఎపిఆర్ఎస్‌లో వీనస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మాడుగుల: ఇటీవల విడుదలైన ఎపిఆర్ఎస్, ఎపిఆర్‌జెసి ఫలితాలలో మాడుగుల విద్యార్థిని పెదపూడి త్రిపుర రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించి సత్తా చాటింది. మాడుగులకు చెందిన వీనస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఎపిఆర్ఎస్, ఎపిఆర్‌జెసి రెండు ఫలితాల్లోనూ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని ఇనిస్టిట్యూట్ కరస్పాండెంట్ తాళపు రెడ్డి నాగచంద్ర తెలిపారు. వీనస్ కోచింగ్ సెంటర్‌లో తర్ఫీదు పొందిన పెదపూడి త్రిపుర ఎపిఆర్ఎస్ రాష్ట్రస్థాయి 6వ ర్యాంక్ సాధించగా, వేపాడ పూర్ణచంద్రరావు ఎపిఆర్‌జెసిలో రాష్ట్రస్థాయిలో 16వ ర్యాంక్, ఏడాకుల పావని 51వ ర్యాంకు, కటకం జయంత్ 184వ ర్యాంకు, దాసరి రామ్‌చరణ్ 342వ ర్యాంకు, తామరపల్లి హేమన్య 67వ ర్యాంకు, చింతపల్లి హైమావతి 1043వ ర్యాంకులను వరుసగా సంపాదించారని కరస్పాండెంట్ చంద్ర తెలిపారు. మీరంతా ఈనెల 20వ తేదీన గుంటూరులో జరగబోవు కౌన్సిలింగ్‌లో పాల్గొంటారని తాళపురెడ్డి నాగచందర్ తెలిపారు. మారుమూల గ్రామాలకు చెందిన తమ పిల్లలకు ప్రవేశపరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంకుల సాధించేలా శిక్షణనిస్తున్న వీనస్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ తాళ్లపురెడ్డి నాగచంద్రకు విద్యార్థులు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు దంగేటి సూర్యరావు, శ్రీనాథు శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, భారత నిర్మాణ సేన గౌరీపట్టపు మహేష్ కుమార్, తల్లిదండ్రులు ఇనిస్టిట్యూట్ యాజమాన్యానికి మరియు పిల్లలకూ అభినందనలు తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - చీడికాడ : స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 15నుంచి వచ్చేనెల ఏడో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ ఎంఎస్ఎల్ జోగేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయానికి పిల్లలను రప్పించి, వారికి వేసవి సెలవులు సక్రమంగా సద్వినియోగం చేసుకునేలా చేసే క్రమంలో వివిధ రకాల పోటీలు, విభిన్న అంశాల్లో నైపుణ్యం పెంపు, ముఖ్యంగా పఠనాశక్తికి కలిగించేలా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. విద్యార్థులలో దాగివున్న చిత్రకళ నైపుణ్యం, ఆటలు పాటలలో రాణించేలా వారిని ప్రోత్సాహించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సెల్‌ఫోన్, టివిలకు అతుక్కుపోయే విధానానికి స్వస్తి చెప్పి, పిల్లలలందూ ఒక చోటుకు చేరి, వారి అభిప్రాయాలను పరస్పరం పంచుకునేలా చేస్తామన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.దయమంతి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞానశిబిరం ప్రారంభించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. కొమరవోలు జెడ్‌పిహెచ్ఎస్ సోషల్ అసిసెంట్ సిహెచ్.రాంకుమార్ పాల్గొని విద్యార్థులకు పుస్తక పఠనం వలన ప్రయోజనాలు, అందించే జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని వివరించారు. డబ్ల్యుడబ్ల్యు పిసి సిహెచ్.భవానీ జనరల్ నాలెడ్జి గురించి వివరించగా, దినపత్రికలు చదవడం వల్ల కలిగే లాభాలను, రోజూ న్యూస్‌పేపర్లను చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ రిక్రియేషన్ గేమ్ ఆడించి విద్యార్థులను ఉత్సహపరిచారు.

సైనిక్ స్కూల్‌కు జి.కోడూరు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : మాకవరపాలెం మండలంలోని జి కోడూరు గ్రామానికి చెందిన విద్యార్థి గంగిరెడ్ల తనుష్‌కుమార్ సైనిక్ స్కూలులో ప్రవేశానికి ఎంపికయ్యాడు. స్థానిక ఎస్‌జికె పాఠశాలలో చదువుతున్న గంగిరెడ్ల తనుష్‌కుమార్ సైనిక్ స్కూల్లో ఆరోతరగతిలో ప్రవేశానికి పరీక్ష రాశాడు. ఈ పరీక్షలో ఉత్తీర్ణతతోపాటు మంచి మార్కులు, ర్యాంకు సాధించడంతో రాజస్థాన్‌లోని గంగానగర్ సైనిక్ స్కూలులో ప్రవేశానికి ఎంపికయ్యాడని పాఠశాల కరస్పాండెంట్ వీరప్రకాశ్ తెలిపారు. ఈమేరకు రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లోని ఎంఎస్ఎం సైనిక స్కూల్‌లో తనుష్‌కుమార్‌కు ప్రవేశార్హత వచ్చిందని అక్కడి పాఠశాల నుంచి విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందింది. కాగా తనుష్ కుమార్‌కు రాజస్థాన్‌లోని సైనిక్‌స్కూల్‌లో సీటు దక్కడంపై తనుష్‌తోపాటు అతని తల్లిదండ్రులను పాఠశాల కరస్పాండెంట్‌తోపాటుపలువురు అభినందించారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం మున్సిపాలిటీలో గురువారం డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు ఆధ్వర్యంలో జెసిబి సాయంతో మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లి, శ్రీకన్య డౌన్ తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులను చేపట్టారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలువల్లో పూడికలు పేరుకుపోయి, పారిశుధ్యానికి ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో శానిటేషన్ పనులు చేపడుతున్నట్లు చిట్టిబాబు తెలిపారు.

బిసిజి వ్యాక్సినేషన్ ప్రారంభం

అనంతగిరిలో బిసిజి వ్యాక్సిన్ వేసుకుంటున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -యంత్రాంగం

అనంతగిరి : క్షయవ్యాధి సంపూర్ణంగా నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం బిసిజి వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ప్రత్యేకంగా చేపడుతోందని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వరి అన్నారు. గురువారం స్థానిక పిహెచ్‌సిలో క్షయవ్యాధి వ్యాక్సినేషన్‌ను ప్రారంభించి, తొలి టీకాను స్థానిక జెడ్‌పిటిసి, సిపిఎం నేత దీసరి గంగరాజుకు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ 18ఏళ్ల నిండి 50ఏళ్ల లోపున్న ప్రతిఒక్కరూ ఈ వ్యాక్సినేషన్ చేయించుకోవాలని సూచించారు. బిపి, సుగర్ వ్యాధులతో బాధపడుతున్న వారికి క్షయవ్యాధి సోకకుండా ముందస్తుగా ఈ వ్యాక్సిన్ దోహపడుతుందన్నారు. అలాగే ఇంట్లో ఎవరైనా టిబి ఉంటే అది ఆ కుటుంబంలోని ఇతరులకు రాకుండా ఉండేందుకు ఆ కుటుంబసభ్యులు వేయించుకోవాలని సూచించారు. పిహెచ్‌సిలతోపాటు అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉందని,, ప్రతిఒక్కరూ సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కె, మోసియా, వాలసీ సర్పంచ్ సెంబి, సన్యాసిరావు, సిబ్బంది నర్సింగరావు, గౌరీ ఆశా కార్యకర్తలు సుందరి, లక్ష్మీ. పాల్గొన్నారు

హుకుంపేట: క్షయవ్యాధి నిర్మూలనకు బిసిజి వ్యాక్సినేషన్‌పై మండలంలోని గూడ, మఠం, కొంతిలి సచివాలయం పరిధిలోని ప్రజలకు స్టేట్ టీం లీడర్ ప్రొఫెసర్ రవీందర్ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంట్లో ఎవరికైనా క్షయవ్యాధి సోకి మందులు వాడి ఉంటే, ఆ కుటుంబసభ్యులంతా విధిగా బిసిజి వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఖైనీ, గుట్కా, ధూమపానం అలవాటున్నవారు, సుగర్, బిపితో బాధపడుతున్న 18ఏళ్ల పైబడిన వారంతా ఆరోగ్యం కేంద్రాల్లో అందుబాటులో ఉండే బిసిజి వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి డాక్టర్ పూర్వజ, కోఆర్డినేటర్ శేషగిరి, వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంధ్య, టిబి సూపర్‌వైజర్ సదానందం నగేష్, ధనరాజు ఎల్‌హెచ్‌పి స్వప్న, ఎఎన్ఎంరత్నకుమారి, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

1623 మందికి బిసిజి టీకాలు

చింతూరు : తులసి పాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డిప్యూటీ డిఎంహెచ్ఓ పుల్లయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర నోడల్ అధికారి రమేష్ ఐటిడిఎ సహకారంతో ఎర్రంపేట ఏడబ్ల్యూఎస్ సచివాలయ పరిధిలో వయోజన బీసీజి టీకాలు 1623 మందికి వేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, సూపర్వైజర్ గంగరాజు, ఏఎన్ఎంలు చిన్న లక్ష్మి, రోజా రమణి కిషోర్‌లు పాల్గొన్నారు.

చింతూరులో బిసిజి వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

మోదకొండమ్మ జాతర దృష్ట్యా...

ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ విజయసునీత

డైవర్షన్ రూట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి -పాడేరు

ఈనెల 19 20 21 తేదీలలో పాడేరు మోదకొండమ్మ జాతర సందర్భంగా ప్రధాన రహదారుల్లో వచ్చే బస్ సర్వీసులను డైవర్షన్ రోడ్డుకు మళ్ళించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జాతరకు వచ్చే భక్తులు, సందర్శకుల రద్దీ దృష్టిలో పెట్టుకొని పాడేరు పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేపడుతన్నారు. విశాఖపట్నం నుండి పాడేరు చేరుకునే బస్సులు చెక్ పోస్ట్ నుండి తుంపాడ, సన్యాసమ్మ పాలెం, ఆడారిమెట్ట మీదగా పాడేరు ఆర్‌టిసి కాంప్లెక్‌కు చేరుకుంటాయని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. గురువారం బస్సుల డైవర్షన్ కోసం సంబంధిత అధికారులతో రోడ్ సర్వే జరిపారు. ఈసందర్భంఆ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో ఎట్టి పరిస్థితులలో ట్రాఫిక్ అంతరాయం కలగరాదని, అదేవిధంగా ప్రయాణికులు, భక్తులు దర్శనం సజావుగా చేసుకోవడానికి వీలుగా పాడేరుకు బస్సులు నడపాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బస్సు రూటులో గల అడ్డమండ వద్ద ఆర్అండ్‌బి అధికారులు మరమ్మతులు చేసిన కాజ్‌వేను పరిశీలించారు. బస్సులు తిరగటానికి వీలుగా కాజ్ వేకు మిగిలిన మరమ్మతులను పూర్తి చేయాలని ఆదేశించారు. రూట్ సర్వేలో కలెక్టర్‌తో పాటు ఆర్‌టిసి డిపో మేనేజర్ వి శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి పర్యవేక్షక ఇంజనీర్ బాల సుందర బాబు, సిఐ నవీన్ కుమార్, ఆర్అండ్‌బి ఎఇలు పాల్గొన్నారు.

పరిశ్రమలకనుగుణంగా గీతం కెమిస్ట్రీ కోర్సులు

ప్రజాశక్తి -మధురవాడ : పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్రవిభాగం బోధన, పరిశోధన కార్యకలాపాలను నిర్వహిస్తోందని గీతం రసాయన శాస్త్రవిభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్‌విఎస్.వేణుగోపాల్ తెలిపారు. నగరంలోని వివిధ కళాశాల విద్యార్థులకు గురువారం నిర్వహించిన "రసాయన శాస్త్రం- ఉజ్వల భవిష్యత్తు" సదస్సులో ఆయన ప్రసంగించారు. ఔషధ రంగం నుంచి అణు ఉత్పాదన రంగం వరకు రసాయన శాస్త్రం విస్తరించిందని పేర్కొన్నారు. ఔషధ పరిశ్రమలు లారెస్ ల్యాబ్, రెడ్డీస్ ల్యాబ్, ఫైజర్ హెల్త్ కేర్‌లతో తమ విభాగానికి అవగాహన ఒప్పందాలు ఉన్నాయన్నారు. గీతం రసాయన శాస్త్ర విభాగం ప్రముఖ పరిశ్రమలకు తగిన విధంగా కోర్సులను రూపొందిస్తోందని, ఈ కారణంగా డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. రసాయన శాస్త్రంలో నానో సైన్స్, గ్రీన్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్, ఆర్గానిక్, సింథసిస్‌లపై గీతంలో పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 100కు పైగా పిహెచ్‌డిలను విభాగం ద్వారా పరిశోధకులు అందుకున్నారని తెలిపారు. గీతం రసాయన శాస్త్ర విభాగానికి కేంద్ర పరిశోధన సంస్థలు డిఎస్‌టితో సహ సిఎస్ఐఆర్ పరిశోధన ప్రాజెక్టులను అప్పగించాయని తెలిపారు.

అధిక రసాయనాల వినియోగంతో అనర్థం

ప్రజాశక్తి -కొత్తకోట : అధిక రసాయనాల ఉపయోగిస్తే అనర్థమని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ మోషే, స్ప్రైకాస్ అన్నారు. గురువారం కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయం,పని అనుభవ కార్యక్రమంలో భాగంగా నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్ప్రైకాస్ కళాశాల విద్యార్థులు మత్స్యవానిపాలెం గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ మోషే, స్ప్రైకాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రైతులు పడుతున్న ఇబ్బందులను వ్యవసాయకళాశాల విద్యార్థులు తెలుసుకొనుటకు ఇది చక్కని కార్యక్రమమన్నారు. ఈసందర్భంగా నూతన సాంకేతికను తెలియజేసేలా విద్యార్థులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌లో ప్రాజెక్టులను గురించి రైతులకు శాస్త్రవేత్తలు పరిశీలించారు. అధిక రసాయనాల ఉపయోగిస్తే ఎటువంటి అనర్థాలు జరుగుతాయో నాటకం రూపంలో రైతులకు వివరించారు. ఆనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. రాజ్ కుమార్, శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎన్. సత్తిబాబు, కిషోర్ కుమార్ బాబు, సర్పంచ్ గణేష్, ఎంపీటీసీ లోవరాజు, మాజీ సర్పంచ్ తాతబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు .తుని వైపు నుంచి నక్కపల్లి వైపు వస్తున్న వ్యాన్, గొడిచెర్ల వద్దకు వచ్చేసరికి వ్యాన్ ముందు వెళ్తున్న లారీ సడన్‌గా నిలుపుదల చేయడంతో ఢీకొట్టింది .ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు .వ్యాన్ ముందుభాగం ప్రమాదంలో దెబ్బతింది .పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు .

వేసవి తాపం నుంచి ఉపశమనం

ప్రజాశక్తి-నక్కపల్లి: వేసవి తాపానికి అల్లాడుతున్న జనం వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు.గురువారం తెల్లవారుజాము నుండి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని కొద్దిపాటి వర్షం కురిసింది .దీంతో రోజంతా చల్లబడింది. రెండు నెలల నుంచి భానుడు నిప్పులు గక్కడంతో ఉష్ణతాపానికి ప్రజలు విలవిలలాడారు. గురువారం రోజంతా ఆకాశం మేఘావతమై ,చల్లటి గాలులు వీస్తూ,చిరుజల్లులు కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడడంతో ప్రజలు సేద తీరారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఉపశమనం పొందారు. తెల్లవారుజామున ఆకాశంలో చీకటి కమ్ముకుని వర్షం కురవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం 32/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ పెదబొడ్డేపల్లి డివిజనల్ ఇంజనీర్ విడివి.రామకృష్ణారావు తెలిపారు. విద్యుత్ లైన్, సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, నిర్వహణ పనులు దృష్ట్యా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బలిఘట్టం, బైపురెడ్డిపాలెం, మెట్టపాలెం, బెన్నవరం, ఏటిగైరంపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

యూనిట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ రమేష్

చిన్న పిల్లల యూనిట్ పరిశీలన

ప్రజాశక్తి - కూనవరం : మండలంలోని కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రిలోని చిన్న పిల్లల యూనిట్ (ఎస్ఎన్‌సియు)ను వైద్య ఆరోగ్య శాఖ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ గురువారం సందర్శించారు. ఎస్ఎన్‌సియులో ఉన్న 30రోజుల చిన్న పిల్లలకు అందుతున్న వైద్య సేవలను అక్కడి వైద్యాధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ యూనిట్‌లో చిన్న పిల్లలకు అందిస్తున్న మందులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చింతూరు డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పి.పుల్లయ్య కూనవరం సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ కె.మహేష్‌బాబు, ఎస్ఎన్‌సియు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుభాష్, చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ టీవీ శేషిరెడ్డి, హెడ్ నర్సు బి.బొజ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమం చేపట్టినట్లు రాజవొమ్మంగి పిహెచ్సి వైద్యాధికారి సుష్మ తెలిపారు. మండలంలోని రాజవొమ్మంగి పిహెచ్సి పరిధిలో డి.మల్లవరం, తంటికొండ, కొండపల్లి, దాకరాయి తదితర గ్రామాల్లోని 356 గృహాల్లో దోమల నివారణ చర్యల్లో భాగంగా ఏసీఎం అనే మందును పిచికారీ చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో జ్వరంతో బాధపడేవారు వెంటనే పిహెచ్సికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్య సిబ్బంది సిహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యుటిఎఫ్ జిల్లా నాయకులు సనపల నాగరాజు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం సంఘం జిల్లా కార్యాలయంలో సనపల నాగరాజు మూడో వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నాగరాజు మృతి యుటిఎఫ్‌కు, ప్రజా సంఘాల ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. యుటిఎఫ్ నిర్మాణంలో, జిల్లా ఉద్యమాలలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక ద్వారా విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేవారన్నారు. అలాగే జిల్లాలో అనేక పాఠశాలల్లో చెకుముకి పోటీలు, సైన్స్ మేళాలు నిర్వహించడం, మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యం చేయడం వంటివాటితో పేరుగాంచారన్నారు. మాధవధారలో ప్రజా సమస్యలపై స్థానికులతో మమేకమై ప్రజా పోరాటాలు చేసేవారన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాలలో శిక్షణా తరగతులు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. నేటి తరం యుటిఎఫ్ కార్యకర్తలకు, నాయకులకు ఆయన ఆదర్శప్రాయుడని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఆయన చూపిన బాటలో నడవడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాడాన అప్పారావు, జిల్లా కోశాధికారి కొత్తపల్లి రాంబాబు, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి వైఎఆర్‌కె.ప్రసాద్, పూర్వ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎం.రామకృష్ణ, పూర్వ జిల్లా కోశాధికారి సనపల స్వామి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి రూ.లక్ష ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెదగంట్యాడ మండల పరిధిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వై.సందీప్‌కు సంజీవని నిధి (డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్) ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాల మేరకు విశాఖపట్నం రెవెన్యూ డివిజన్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ గురువారం సందీప్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు.

ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినా..

భద్రతపై నిర్లక్ష్యం వద్దు

విశాఖపట్నం రేంజ్ డిఐజి విశాల్ గున్ని

ప్రజాశక్తి - విజయనగరం కోట : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినా భద్రతపై నిర్లక్ష్యం చేయొద్దని విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని అన్నారు. ఈ నెల 13 సార్వత్రిక ఎన్నికల తరువాత జరిగిన సంఘటనలు, తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై విశాఖపట్నం రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్‌పిలు, ఇతర పోలీసు అధికారులతో ఆయన గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం, జూమ్ మీటింగు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు నెలలుగా రేంజ్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది చాలా కష్టపడి, ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పని చేయడం వల్ల ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలను చిన్న చిన్న సంఘటనలు మినహా ప్రశాంతయుతంగా నిర్వహించుకోగలిగామని చెప్పారు. అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఎన్నికల తరువాత మన ప్రాంతం ప్రశాంతంగా ఉందన్న నిర్లక్ష్యం వద్దని, మరో 15 రోజులు ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తి, నిబద్ధతతో పని చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, ఈ ప్రాంతంలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలూ ఉత్పన్నం కాకుండా క్షేత్ర స్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పోలింగుకు కొద్ది రోజులు ముందు, పోలింగు రోజు, పోలింగు తరువాత గ్రామాల్లో చోటు చేసుకున్న చిన్న చిన్న సంఘటనల పట్ల నిర్లక్ష్యం వద్దని, ఆయా గ్రామాలను అధికారులు పలుమార్లు సందర్శించాలని, గ్రామ పెద్దలు, గ్రామస్తులతో మమేకమై, వారిని వివాదాలకు దూరంగా ఉంచాలని, ఒకరితో ఒకరు శాంతియుతంగా మెలగాలని విజ్ఞప్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో చురుకుగా ఉన్న వ్యక్తులను, రాజకీయంగా వివాదాలు సృష్టించే వ్యక్తులను గుర్తించి, వారిని పోలీసు స్టేషనుకు పిలిచి, కౌన్సిలింగు చేయాలని, క్షేత్ర స్థాయిలో రాజకీయ పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల నుండి స్వగ్రామాలకు వచ్చిన వ్యక్తుల వల్ల ఏమైనా సమస్యలు తలెత్తే అవకాశం ఉంటే గుర్తించి, వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. వివాదాలు తలెత్తేందుకు అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి, పోలీసు పికెట్లను ఏర్పాటు చేయాలని, ఆయా గ్రామాల్లో పరిస్థితులను, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తులను గుర్తించి, వారు గ్రామానికి ఏ పని మీద వచ్చినదీ, ఎందుకు వచ్చినదీ తెలుసుకోవాలని, ఆయా అంశాలను పాయింట్ బుక్కుల్లో నమోదు చేయాలని అన్నారు. ఇవిఎంలను భద్రపర్చిన స్ట్రాంగు రూమ్స్ వద్ద మూడంచెల భద్రతను ఇప్పటికే ఏర్పాటు చేసామని తెలిపారు. ఎన్నికల తరువాత వివిధ పోలీసు స్టేషన్‌ల్లో నమోదైన కేసులను డిఐజి సమీక్షించి దర్యాప్తులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 4న కౌంటింగు నిర్వహించే కేంద్రాల వద్ద కూడా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, వాటిని జిల్లా ఎస్‌పిలు ముందుగానే సమీక్షించాలని అన్నారు. సమావేశంలో విజయనగరం జిల్లా ఎస్‌పి ఎం.దీపిక, మన్యం జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్, శ్రీకాకుళం జిల్లా ఎస్‌పి జిఆర్.రాధిక, అనకాపల్లి జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, విజయనగరం అదనపు ఎస్‌పి అస్మా ఫర్వీన్, శ్రీకాకుళం అదనపు ఎస్‌పి ప్రేమ్ కాజల్, పార్వతీపురం మన్యం అదనపు ఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, పార్వతీపురం ఎఎస్‌పి సునీల్ షరోన్, ట్రెయినీ ఐపిఎస్ ఎం.జావలి, పలువురు డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశాల్ గున్ని

విశాఖ పోర్టు మరో రికార్డు

45 రోజుల్లో 10 మిలియన్ టన్నుల సరుకు రవాణా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : సరుకు రవాణాలో విశాఖపట్నం పోర్టు అథారిటీ పాత రికార్డులను తిరగరాస్తూ మరో నూతన రికార్డు నెలకొల్పింది. 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును కేవలం 45 రోజుల్లోనే రవాణా చేయడం ద్వారా పోర్టు 2024-25 ఆర్థిక సంవత్సరంలో సరికొత్త రికార్డును లిఖించింది. గత ఆర్థిక సంవత్సరంలో 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును 47 రోజుల్లో చేసిన రవాణాయే ఇప్పటి వరకూ రికార్డుగా ఉండేది. ప్రస్తుతం పోర్టు ఆ రికార్డును తిరగరాసింది. ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన ట్రాఫిక్ మేనేజర్ జిఆర్‌వి.ప్రసాదరావు, సిబ్బందిని పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు, ప్రశంసించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పోర్టు 90 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డు సరుకు రవాణాను సాధించడంలో కృషి చేయాలని ఆకాంక్షించారు.

రికార్డుల పరంపర

2023-24 ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి పోర్టు చరిత్రలోనే సరికొత్త రికార్డును నెలకొల్పింది. తద్వారా గతంలో చేసిన 73.75 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డును తిరగరాసింది. ఈ రికార్డు విశాఖపట్నం పోర్టు సామర్థ్యాన్ని తెలియజేయడమేకాక మారిటైం సెక్టార్‌లో విశాఖపోర్టు ప్రాముఖ్యతను మరోమారు ఇనుమడింపజేసింది. ఆ తరువాత మరిన్ని రికార్డులు సాధించేందుకు దోహదపడింది.

సీలేరులో కురుస్తున్న వర్షం

సీలేరులో చిరుజల్లులు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో గురువారం సాయంత్రం చిరు జల్లులు కురిచాయి. రెండు రోజుల క్రితం భారీ వర్షం కురవడంతో కొంతవరకు చల్లదనం ఏర్పడినప్పటికీ మళ్లీ ఎండలు తీవ్ర స్థాయిలో కాయడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురవడంతో కాస్త ప్రజలు ఉపశమనం పొందారు.

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

డెంగీపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి- యంత్రాంగం : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన ఆ శాఖ అధికారులు, సిబ్బంది రంపచోడవరం ఏజెన్సీ పరిధిలోని పలు మండలాల్లో గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

రంపచోడవరం : స్థానిక ఏరియా ఆసుపత్రిలో డెంగీ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుండి బోర్నగూడెం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి మాట్లాడుతూ జ్వరం నాలుగు రోజులు మించి వస్తే వెంటనే హాస్పిటల్‌కి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డి.సౌజన్య, హారిక, ఇందిరా, కౌన్సిలర్ ఎన్ వాసు, ల్యాబ్ టెక్నీషియన్ ఐ.నాగభూషణం, వీర కుమార్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని రాజవొమ్మంగి పిహెచ్‌సి వైద్యాధికారి సుష్మ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది రాజవొమ్మంగిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది చీడిపల్లి ప్రసాద్, సోమరాజు, సుధాకర్ రమాబాయ్, లక్ష్మామమ్మ, నానిబాబు, పలువురు పిహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్.పురం : ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లో వాడుక నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని మండలంలోని రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అనిల్ కుమార్ అన్నారు. గురువారం రేఖపల్లి పిహెచ్‌సి సిబ్బంది జాతీయ డెంగ్యూ దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెచ్‌వి పున్నమ్మ, ఎస్ రాజేష్, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని కొండమొదలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు జి.శిరీష, సిహెచ్ నాగార్జున ఆధ్వర్యంలో గ్రామంలో గురువారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జి శిరీష, నాగార్జున, ఎంపీహెచ్ఈఓ ఆర్.నాగేశ్వరరావు, ఎంపిహెచ్ఈఓ కోసు శ్రీనివాసరావు, ఇందుకూరుపేట, కొండ మొదలు ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.